## ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** డిమాండ్ల సాధనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మండల, డివిజన్ కేంద్రాల్లో వినతిపత్రాలు అందించడం జరిగింది. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. జూన్ 2 నాటికి పీఆర్సీ అమలు చేయాలని కోరారు.

## స్టాంప్ పేపర్స్‌కు సాంకేతికలోపం

రోజంతా నిలిచిన కార్యకలాపాలు




**ప్రజాపక్షం/బహదూర్‌పురా:** వివిధ వ్యవహారాల నిమిత్తం వినియోగించే స్టాంప్ పేపర్లకు వెబ్‌సైట్ సమస్య వచ్చింది. వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో క్రయ, విక్రయాలు, కోర్టు పనులు, అఫిడవిట్లకు ఇబ్బంది కలిగినట్లు సమాచారం. శుక్రవారం తెలంగాణ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన స్టాంప్స్ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో అవసరమైన స్టాంప్ పేపర్ల అమ్మకాలు నిలిచిపోయాయి. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ పరుగులు పెట్టారు. ముఖ్యంగా హైకోర్టు పరిసర ప్రాంతాలు, రంగారెడ్డి కోర్టు, సిటీ సివిల్ కోర్టు తదితర ప్రాంతాల్లో ప్రజలు, అడ్వకేట్లు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. స్టాంప్ పేపర్ల సైట్ పనిచేయకపోవడంతో అనేక న్యాయపరమైన ప్రక్రియలు ఆలస్యమయ్యాయి. ఇలా కొనసాగితే ప్రభుత్వం కూడా ఆదాయం కోల్పోయే ప్రమాదం లేకపోలేదు. స్టాంప్ విక్రేతలు కూడా సాంకేతిక సమస్యల కారణంగా ఏమి చేయలేక ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సైట్ ఎప్పుడు సరిచేస్తారా? అంటూ రోజంతా ఎదురు చూస్తూ గడిపారు.

## జనాభా లెక్కలను పునఃపరిశీలించాలి

-కమ్మ సంఘాల సమాఖ్య డిమాండ్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో కమ్మ సామాజిక వర్గానికి సంబంధించిన జనాభా లెక్కలపై ప్రభుత్వం పునఃపరిశీలించాలని కమ్మ సంఘాల సమైక్య డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం అధ్యక్షుడు బొడ్డి రవి శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శి గంగవరపు రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ...1967 నుంచే తమ సామాజిక వర్గం వేలాది గ్రామాల్లో నివసిస్తూ, కాలక్రమేణా పట్టణ ప్రాంతాల్లో కూడా స్థిరపడిందని తెలిపారు. తమ లెక్కల ప్రకారం రాష్ట్రంలో కమ్మ సామాజిక వర్గం జనాభా సుమారు 19 నుంచి 20 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఈ వర్గం జనాభాను కేవలం 3 లక్షల 68 వేలుగా ప్రకటించడం ఆశ్చర్యకరమని అన్నారు. దీని వల్ల ప్రభుత్వ పథకాల నుంచి తమ వర్గం దూరమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై స్పష్టత ఇచ్చేందుకు, వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన లెక్కలను తక్షణమే పునఃపరిశీలించి, నిజమైన జనాభా గణాంకాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో సమాక్య ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణ ప్రసాద్, గౌరవ సలహాదారుడు బండి రమేష్, ముఖ్య సలహాదారుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌ల జనాభాను సవరించకపోతే ఉద్యమం

తెలంగాణ ముదిరాజ్ మహాసభ



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** రాష్ట్ర కులగణన నివేదికలో ముదిరాజ్‌లను 26.36లక్షలుగా చూపించడం అన్యాయమని తెలంగాణ ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ , అధ్యయన వేదిక చైర్మన్ నీలం రాములు ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేలో ముదిరాజ్‌ల జనాభా కనీసం రూ.40లక్షలుగా నమోదైందని, పదేళ్లకాలంలో 13లక్షల మేర జనాభా ఎలా తగ్గుతుందని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో ముదిరాజ్ సంఘాలన్నీ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తాయని తెలిపారు. అదేవిధంగా, ముదిరాజ్‌లను బిసి డి నుంచి బిసి ఎ గ్రూపులోకి మార్చాలని డిమాండ్ చేశారు. త్వరలోనే రాష్ట్రస్థాయిలో రెండురోజుల మత్స్యకారుల శిక్షణా తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మహాసభ నేతలు పిట్టల వెంకట నర్సయ్య, చింతకింది దినేశ్‌తదితరులు పాల్గొన్నారు.

## పివిఆర్ థియేటర్ మృతుడి కుటుంబానికి.. రూ.లక్షన్నర సహాయం

-తదుపరి సహాయానికి మరో మారు చర్చలు

**ప్రజాపక్షం/పంజాగుట్ట:** మెట్రో ఎర్రమంజిల్ గలేరియా మాల్‌లోని పివిఆర్ థియేటర్‌లో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్ సత్యనారాయణ కుటుంబాన్ని యాజమాన్యం ఆదుకునేందుకు సుముఖత చూపించింది. ఇందులో భాగంగా బాధిత కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.1,50,000 (లక్షన్నర) ఆర్థిక సాయాన్ని అందజేసింది. సహాయానికి మరోమారు చర్చిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

**కుటుంబానికి అండగా...**

మాల్ ఆవరణలో హఠాన్మరణం చెందిన సూపర్‌వైజర్ కుటుంబం ఒక్కసారిగా పెద్ద దిక్కును కోల్పోవడంతో తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ క్లిష్ట సమయంలో ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో మాల్ ప్రతినిధులు మృతుడి బంధువులను కలిసి ఈ నగదును అందజేశారు.ఈ ఆర్థిక సాయం అంత్యక్రియలకు, ఇతర తక్షణ అవసరాలకు కొంత మేర ఊరట నిస్తుందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదిలాఉండగా.. పూర్తి సహకారం అందిస్తామని థియేటర్ యాజమాన్యం హామీ ఇవ్వడం జరిగింది. తక్షణ సాయంతో పాటు, ప్రభుత్వ పరంగా రావాల్సిన బెనిఫిట్స్, ఇతర ఇన్సూరెన్స్ ప్రక్రియలలో కూడా కుటుంబానికి పూర్తి స్థాయిలో సహకరిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. తోటి ఉద్యోగిని కోల్పోవడం బాధాకరమని, వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా మాల్ ప్రతినిధులు తెలిపారు.

# ఎన్ఐఏ నోటీసులను వెనక్కి తీసుకోవాలి

వామపక్ష, ప్రజాసంఘాల ప్రతినిధులు డిమాండ్



**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పోటు రంగారావు, ఇతర మేధావులు, హక్కుల కార్యకర్తలకు ఎన్ఐఎ నోటీసులు ఇవ్వడం అంటే మాట్లాడకుండా చేయటమే... ఇటువంటి చర్య రాజ్యాంగ హక్కులను, ఫెడరల్ స్ఫూర్తిని కాలరాయడమే... దుఃఖాన్ని, సానుభూతిని వ్యక్తం చేయడాన్ని కూడా నేరంగా భావించడం ఏమిటి? జరిగే పరిణామాలు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి.. వీటి మీద గట్టిగా ఉద్యమించాలని ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లి పిలుపునిచ్చారు. ఎన్ఐఏ నోటీసులను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కె.రమ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ప్రొఫెసర్ లక్ష్మి నారాయణ, సిపిఐ రాష్ట్ర నాయకుడు స్టాలిన్ మాట్లాడుతూ... ప్రస్తుతం రాజ్యాంగ హక్కులను, చట్టాలను ఉల్లంఘిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రంగాలనూ, వ్యవస్థలనూ కేంద్రం ఇష్టారీతిగా మలుచుకుంటున్నదని మండిపడ్డారు. కనీసంగా మాట్లాడలేని స్థితిని కల్పించుతున్నారని వాపోయారు. వామపక్షాలు, ప్రజాస్వామికవాదులు రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ రోజు గట్టిగా నినదించకపోతే, రేపు మాట్లాడే అవకాశం లేకుండా పోతుందన్నారు. ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఎన్ఐఎ చేస్తున్న ఘటనలపై రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. రాష్ట్రంలో వందలాది మందికి నోటీసులు ఇవ్వడం, విచారించడం చేస్తూ ఉంటే చోద్యం చూస్తున్నదని విమర్శించారు. ఈ సందర్భంగా సిఎల్‌సి అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఎస్‌యూసిఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి మురహరి, మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కెజి రాంచందర్, ఎంసిపిఐ నాయకులు కె.వెంకన్న, రవిచంద్ర (ఎఫ్ఎర్), సిపిఐ ఎంఎల్‌సిపి ప్రసాద్, ఆర్ఎస్‌సి జానకిరాములు, ఎంఎస్‌పి శ్రీనివాస్, సిఎల్‌సీ నారాయణరావు, ప్రజాకవి జయరాజు, ఐఎపిఎల్ అడ్వకేట్ సురేష్, డేవిడ్ మాట్లాడుతూ... కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నదని, అణచివేత, నిర్బంధం కొనసాగిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక ప్రజా వ్యతిరేక చట్టాలు, చివరకు దేశాన్ని విభజించే వైపుగా డీలిమిటేషన్ తీసుకొస్తుందన్నారు. రాజ్యం రానురాను గుండాయిజంగా చలామణి అవుతున్న స్థితి వస్తుందన్నారు. అమెరికా నేరుగా ప్రపంచంలో గుండాగిరి చేస్తున్నదన్నారు. ప్రజాస్వామ్యాన్ని, ఫెడరలిజం లేకుండా చేసేట్లు, ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని... వీటికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాల ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.సమావేశంలో మాస్‌లైన్ నాయకులు ఎం.హనుమేశ్, సదానందం, టియుసిఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె. సూర్యం, ఎస్ఎల్ పద్మ, పీఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు డి.స్వరూప, ప్రవీణ్, ప్రదీప్(టియుసిఐ), రవి, కృష్ణ, భీమేష్(పీవైఎల్), రాకేష్, హరీష్ (పిడిఎస్ యు), లక్ష్మీ బాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ తేజస్విని బర్తరఫ్ చేయాలి




కాంగ్రెస్ నేతల లోక్‌భవన్ ముట్టడితో ఆందోళన

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** తెలంగాణ రాష్ట్ర విభజనను పాకిస్తాన్ విభజనతో పోలుస్తూ.. రాష్ట్ర ఏర్పాటును కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యను వెంటనే పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని ఖైరతాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం లోక్‌భవన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ డౌన్ డౌన్, మోడీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ రాజ్ భవన్ ముట్టడికి యత్నించారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్ వనం సంగీత, మహాలక్ష్మి నాయకులు నర్సింగరావు, రామన్ గౌడ్, కాటూరి రమేష్, నరేష్ లు మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంటు సాక్షిగా బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్‌తో పోల్చడం తెలంగాణను అవమానించడమేనని అన్నారు. 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను దెబ్బతీసే విధంగా మాట్లాడినందుకు తేజస్వి సూర్యను వెంటనే పార్టీ నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆరు దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలు ఆంధ్ర దోపిడికి వ్యతిరేకంగా ఆత్మగౌరవం కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నారని గుర్తు చేశారు.

## బిసి మహిళా రిజర్వేషన్ కోసం...
# పసిపాపతో ప్రొఫెసర్ తల్లి పోరాటం

ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా డాక్టర్ సల్లా సౌజన్య ఉధృత ఉద్యమం

సోషల్ మీడియాలో వైరల్...

పలువురి ప్రశంసలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చట్టసభల్లో బిసి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా పాలుతాగే వయస్సు కల్గిన పసిపాపతో ఒక తల్లి చేస్తున్న పోరాటం సర్వత్రా చర్చనీయాంశం అయింది. దేశ రాజధానిలోని పార్లమెంటు కూతవేటు దూరంలో ఉండే జంతర్ మంతర్ లో వేలాది మహిళలతో కలిపి డాక్టర్ సల్లా సౌజన్య, బిసి మహిళా రిజర్వేషన్ కోసం ఉధృత ఉద్యమం చేయడం అందరినీ ఆకట్టుకున్నది. చిన్నారితో కలిసి ఆమె ఉద్యమించడం... ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాగా, పలువురి సౌజన్య పోరాట తీరుకు ప్రశంసలు గుప్పించారు. పీజేటీఎస్ఏయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ప్రస్తుతం సౌజన్య పని చేస్తున్నారు. గతంలో ఎన్ఎస్‌యూఐ మాజీ నేషనల్ సెక్రటరీగా సైతం సేవలు అందించారు. ప్రముఖ విద్యావేత్తగా, సామాజిక కార్యకర్త, మహిళా రిజర్వేషన్ బిల్లులో ఒబిసి మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన లేవనెత్తారు. ఈ నిరసనలో ఆమె తన రెండు నెలల పసికందుతో కలిసి పాల్గొనడం సర్వత్రా చర్చనీయాంశం అయింది. ప్రస్తుత మండుటెండల్లో ఒక తల్లి, ఒక విద్యావేత్త, ఒక నాయకురాలు తన కుటుంబ బాధ్యతల మధ్యలో కూడా సమాజ న్యాయం కోసం వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి ఏర్పడటం గమనార్హం. మహిళా రిజర్వేషన్ బిల్లును దేశవ్యాప్తంగా స్వాగతించినప్పటికీ, అందులో బిసి,ఒబిసి మహిళలకు ప్రత్యేక కోటా లేకపోవడం సమానత్వ సూత్రాలకు విరుద్ధంగా ఉందని ఆమె వ్యాఖ్యానించారు. మోడీ ప్రభుత్వం బిసిలకు అన్యాయం చేస్తుంటే తాము చూస్తూ ఊరుకోమని చెప్పారు.

## నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి

ఆకస్మిక తనిఖీలో సిఎంసి కమిషనర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజలకు అసౌకర్యం కలగకుండా, పెండింగ్‌లో ఉన్న సివిల్ పనులను వెంటనే పూర్తి చేయాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) కమిషనర్ శృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. సిఎంసి కమిషనర్ గిరి నగర్ వార్డులో శుక్రవారం విస్తృత క్షేత్ర స్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ పర్యటనలో చింతల్ డెప్యూటీ కమిషనర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వార్డులోని అంతర్గత రహదారులను కాలినడకన సందర్శించి, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం యానిక్ పార్కును సందర్శించి అక్కడ ఉన్న ఓపెన్ జిమ్ పరికరాల స్థితిగతులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక నివాసితులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ అనంతరం విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. డిఫెక్ట్ లయబిలిటి పీరియడ (డిఎల్‌పి) కింద ఉన్న పనులను గుర్తించి, సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా వెంటనే పూర్తి చేయించాలన్నారు. ఏపిహెచ్‌బి పార్కులో పాడైన జిమ్ పరికరాలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలన్నారు. పార్కులోని బోర్‌వెల్ సౌకర్యాన్ని పునరుద్ధరించి, నీటి లభ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదర్శ నగర్ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న వరద నీటి కాలువ నిర్మాణ పనులను యుద్ధప్రతిపాదికన ప్రారంభించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లను వివిధ విభాగాల సమన్వయంతో త్వరితగతిన పునరుద్ధరించాలన్నారు. పౌర సౌకర్యాల నిర్వహణలో అలసత్వం వహించకూడదన్నారు. నిర్దేశిత గడువులోగా పనులన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కమిషనర్ శృజన స్పష్టం చేశారు.

# ప్రతి ఒక్కరూ ప్రజా పోలీస్‌గా మారాలి: విసి సజ్జనార్

తొమ్మిదేళ్ల బాలికను రక్షించిన సాహసవంతులకు నగర సిపి సజ్జనార్ సన్మానం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తొమ్మిదేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న నిందితుడిని సాహసోపేతంగా అడ్డుకుని, పోలీసులకు అప్పగించిన ముగ్గురు పౌరులను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం సెజల్, గణపతి, కాశీనాథ్‌లను ఆయన ఘనంగా సన్మానించి వారికి ప్రశంసా పత్రాలతో పాటు నగదు రివార్డును అందజేశారు. ఈ నెల 14న సెజల్ తన స్నేహితుడు గణపతితో కలిసి యూసుఫ్‌గూడ నుండి మాదాపూర్ వైపు బైక్‌పై వెళ్తుండగా, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10 సమీపంలో ఒక వ్యక్తి చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని గమనించారు. ఆ చిన్నారి కళ్లలో భయాన్ని చూసి చలించిపోయిన వారు, తక్షణమే స్పందించి అటుగా వెళ్తున్న కాశీనాథ్, నారాయణల సాయంతో నిందితుడిని అడ్డుకున్నారు. బాలికను సురక్షితంగా రక్షించడమే కాకుండా, డయల్ 100కు సమాచారం అందించి నిందితుడిని పోలీసులకు పట్టించారు.పోలీసుల విచారణలో నిందితుడు యూసఫ్ గూడకు చెందిన జావీద్ అనే వ్యక్తిగా తేలింది. బాలిక తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన సమయంలో, ఆ చిన్నారికి ఐస్‌క్రీమ్ కొనిస్తానని మభ్యపెట్టి తన బైక్‌పై తీసుకెళ్లి లైంగిక వేధింపులకు గురిచేసినట్లు నిర్ధారణ అయ్యింది. నిందితుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సజ్జనర్ మాట్లాడుతూ.. సమయస్ఫూర్తితో, సామాజిక బాధ్యతతో వ్యవహరించిన ఈ యువతను కొనియాడారు. వీరి సాహసం సమాజానికి ఒక గొప్ప సందేశమని, మహిళలు, చిన్నారుల రక్షణలో పౌరులు ఇలాగే అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను అరికట్టవచ్చు అని ఆయన అన్నారు. నేరాల నియంత్రణలో పోలీసులు ఎంత కృషి చేసినా, పౌర చైతన్యం తోడైనప్పుడే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ ప్రజా పోలీస్ గా మారాలని పిలుపునిచ్చారు. ఇటీవల గోల్కొండ ప్రాంతంలో మహమ్మద్ ఫిరోజ్ అనే వ్యక్తి ఇలాగే ఎనిమిదేళ్ల బాలికను రక్షించిన ఉదంతాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సమాజంలో ఏదైనా అనుమానాస్పద ఘటనలు జరిగినప్పుడు భయపడకుండా వెంటనే డయల్ 100 కి ఫోన్ కాల్ గానీ, హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నెంబర్ 94906 16555 కి సమాచారం అందించి, బాధ్యతాయుతమైన పౌరులుగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐటి సెల్ ఇన్‌స్పెక్టర్ రమేష్, జూబ్లీహిల్స్ ఎస్ఐ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకుందాం

లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు ఎం.దశరథ్ నాయక్



**ప్రజాపక్షం/ హిమాయత్‌నగర్ :** కాళేశ్వరం ప్రాజెక్టుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు ఎం.దశరథ్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లక్షలాది ఎకరాలకు నీరిచ్చే కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకొందామన్నారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజల ఆస్తి అని, క్రుంగిన చోట బాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్మించడం తప్పు కాదని, దానిని కాపాడకపోవడమే తప్పు అని ఆయన పేర్కొన్నారు. పార్టీల ఆధిపత్యం కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. అదేవిధంగా, మహిళా బిల్లుకు ఎంఐఎం పార్టీ మద్దతు ఎందుకు ఇవ్వటం లేదో వివరణ ఇవ్వాలన్నారు. రాజకీయరంగంలో మహిళలకు ప్రాతినిథ్యం ఇచ్చే మహిళా బిల్లుకు, డీ లిమిటేషన్ బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చి, దేశ బలోపేతానికి సహకరించాలని దశరథ్ నాయక్ కోరారు. , బల్ల సత్తయ్య, విజయ్‌కుమార్, మందుల వరలక్ష్మి , పండుగ బాలు, సతీశ్, దమ్మిగారి కనకయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టడంలో...
# ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలి

కోత్వాల్ సజ్జనార్ ప్రజలకు పిలుపు



**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టడంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు పోలీసులతో సహకరించాలని కోత్వాల్ విసి సజ్జనార్ పిలుపునిచ్చారు. రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులకు, ముఖ్యంగా యువతకు కచ్చితంగా డ్రగ్ టెస్టులు నిర్వహించాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించామని తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని మాదకద్రవ్యాల రహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కఠిన చర్యలు చేపడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు గాంధీ ఆసుపత్రిలోని డీఅడిక్షన్ కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించి ఇటీవల టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన డ్రగ్ టెస్టుల్లో పాజిటివ్ వచ్చిన రౌడీ షీటర్లతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితి, వ్యసనం నుంచి బయటపడేందుకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అక్కడికి వచ్చిన వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, బాధితులకు మానసిక ధైర్యాన్ని ఇవ్వాలని సూచించారు. అనంతరం వైద్యులతో సమావేశమై, కౌన్సెలింగ్ ప్రక్రియ, చికిత్స అందిస్తున్న తీరును అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోత్వాల్ సజ్జనర్ మాట్లాడుతూ.. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచామని, ఇందులో భాగంగా 239 మంది రౌడీ షీటర్లకు డ్రగ్ టెస్టులు నిర్వహించగా, 188 మందికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం 35 మంది గాంధీ డీఅడిక్షన్ కేంద్రంలో చికిత్స పొందుతుండగా, మిగతా వారికి ఇతర కేంద్రాల్లో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నామని అన్నారు. వారం క్రితం ప్రారంభమైన ఈ 15 రోజుల ప్రత్యేక కౌన్సెలింగ్, చికిత్స ద్వారా వారిలో మార్పు వస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు.నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో అత్యాధునిక డ్రగ్ డిటెక్షన్ కిట్లు అందుబాటులో ఉంచామని వివరించారు. కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.వాణి, సైకియాట్రీ హెచ్‌ఓడీ డాక్టర్ సురేష్, ఆర్ఎంవోలు డాక్టర్ శేషాద్రి, డాక్టర్ యుగేందర్, డాక్టర్ సరిత, డిప్యూటీ ఆర్ఎంవో డాక్టర్ రజిని పాల్గొన్నారు. పోలీస్ విభాగం నుంచి సికింద్రాబాద్ డీసీపీ రక్షితా కృష్ణామూర్తి, టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్, అదనపు డీసీపీ అందే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గోల్డెన్ అవర్ కీలకం

-ప్రమాద బాధితులకు సహకరిస్తే పారితోషికం

-రాహ్ వీర్ పథకం ద్వారా రూ.25 వేల నగదు బహుమతి

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** అరైవ్ అలైవ్ క్యాంపెయిన్‌లో భాగంగా శుక్రవారం జూబ్లీహిల్స్ జోన్ పోలీస్‌ల ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్‌లో అంబులెన్స్ డ్రైవర్స్, వాలంటీర్స్, కమ్యూనిటీ మెంబర్స్, ఇతరులకు రోడ్డు ప్రమాదంలో 'గోల్డెన్ అవర్' ప్రాముఖ్యత, ట్రాఫిక్ నియమాలు, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాయింట్ సిపి(ట్రాఫిక్) జోయెల్ డేవిస్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో 'గోల్డెన్ అవర్' అనేది ప్రమాదం జరిగిన వెంటనే మొదటి 60 నిమిషాలు చాలా కీలకమన్నారు. ఈ సమయంలో సత్వర వైద్య చికిత్స, తీవ్రమైన రక్త స్రావాన్ని, మరణాన్ని నివారించడం, దీర్ఘకాలిక వైకల్యాన్ని తగ్గించేలా అత్యధిక అవకాశాన్ని కల్పిస్తాయని తెలిపారు. వేగవంతమైన ప్రతిస్పందనకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గుండె ఆగిపోవడం వంటి కొన్ని సందర్భాల్లో, ఈ సమయ వ్యవధి మరింత తక్కువగా ఉంటుందని.. దీనిని 'స్వర్ణ 10 నిమిషాలు' అని పిలుస్తారని.. సిపిఆర్ ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చని తెలిపారు. గోల్డెన్ అవర్‌లో బాధితులకు అందించాల్సిన ప్రథమ చికిత్స గురించి ఆటో, క్యాబ్, బస్సు డ్రైవర్లకు, యువతకు ట్రైనింగ్ ఇచ్చి బాధితుల ప్రాణాలు కాపాడవచ్చన్నారు. తీవ్రమైన ప్రమాదం జరిగిన తర్వాత మొదటి కీలక గంట అయిన 'గోల్డెన్ అవర్'లో రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసిన వ్యక్తులకు భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం 'రాహ్‌వీర్' (మంచి సమారిటన్) పథకం ద్వారా రూ.25,000 నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డిసిపి(ట్రాఫిక్ 2 కాజల్ సింగ్ మాట్లాడుతూ, డ్రైవింగ్ చేసేటప్పుడు ఎప్పుడు కూడా అప్రమత్తతో ఉండాలన్నారు. నిర్లక్ష్యం డ్రైవింగ్, మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లో డ్రైవింగ్ చేయరాదన్నారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ అనేది ఒక చురుకైన, సురక్షితమైన డ్రైవింగ్ వ్యూహమని.. ఇది ప్రమాదాలను ముందుగానే ఊహించడం, అప్రమత్తంగా ఉండటం, మీ వాహనం చుట్టూ ఉన్న స్థలాన్ని గమనించడం ద్వారా ప్రమాదాలను చురుకుగా నిరోధించేందుకు ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో అదనపు డిసిపి(ట్రాఫిక్2) సి.వేణుగోపాల్‌రెడ్డి, జూబ్లీహిల్స్ జోన్ ఏసిపి (ట్రాఫిక్) కె.హరిప్రసాద్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ సిఐ రవీందర్, ఇన్‌స్పెక్టర్లు మహేష్ స్వామి, శేఖర్, బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ సిఐ నాగుల అశోక్, అపోలో ఆసుపత్రి ప్రొఫెసర్ డా.విశ్వేశ్వర్‌రెడ్డి, సీనియర్ కాన్సులేట్ డా.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

